


పుట్టినరోజు పండుగ ముగిసింది.

ఎనిమిదయ్యేసరికి అతిథులు జారుకున్నారు. పార్టీ గొప్పగా జరిగినందుకు సుందరి సంతోషించింది. తెల్లవారుఝామునుంచి అటు ఇటు తిరగడంవల్ల తలంటుకున్న చిరాకువల్ల సుందరికి అలసటగా ఉంది. మేడమీదికెళ్ళి కొత్త పట్టు చీర తీసి, ఇస్త్రీచీర కట్టుకోగానే బరువు దిగినట్లయింది. ఆయా తెచ్చిన బత్తాయి రసం త్రాగి కిందికి వచ్చింది. నౌకర్లు హాలు బాగుచేస్తున్నారు.

సుందరి పోర్టికోలో స్తంభానికి ఆనుకుని నిలబడింది. ఇంతలో ఓ రిక్షా వచ్చి ఆగింది. దాంట్లోంచి రాజు దిగాడు.

"ఇప్పుడా రావడం ?" సుందరి ముద్దుగా కోప్పడింది.

రాజు ఆమె దగ్గరగా వచ్చాడు "ఏం చెయ్యను డియర్. నేను బయలుదేరేసరికి మా జి.యం. వచ్చాడు. వాడ్ని వదిలించుకునేసరికి ఈ టైం అయ్యింది."

"నేను చాలా డిజప్పాయింట్ అయ్యాను."

రాజు తను తెచ్చిన శివపార్వతుల దంతం బొమ్మ కానుకగా ఇచ్చాడు.

"నో ప్లెజర్" సుందరి మందహాసం చేసింది.

రాజు లేటుగా వచ్చినందుకు ఏమీ బాధపడలేదు. అతడు కావాలనుకునే ఆలస్యంగా వచ్చాడు. పదిమందితో తాను వస్తే గొప్పేమిటి ? సుందరి తనకోసం ఎదురు చూడాలి !

రిఫ్రెష్‌మెంటు తీసుకున్నాక యిద్దరూ తోటలో కూర్చున్నారు. ఆకాశంలో వెన్నెలరాజునవ్వుతున్నాడు. చల్లటిగాలిని చెట్లు సరఫరా చేస్తున్నాయి. వెన్నెల్లో పచ్చగడ్డిమీద ఏకాంతంలో యవ్వనం చేసే రొదలో యిద్దరూ చాలా సేపు మౌనంగా కూర్చున్నారు.

"ఏంచేశావు మన పెళ్ళి విషయం?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

దానికోసమే సుందరి ఎదురు చూస్తోంది, "సారీ రాజూ... ఎంతచెప్పినా మా డాడీ ఒప్పుకోవడంలేదు. నా పెళ్ళి మీద ఆయనకు కొన్ని ఆశయాలున్నాయి. తన అల్లుడు తనకంటే పొజిషన్‌లో ఉండాలని డాడీ కోరిక."

రాజు కసిగా చూశాడు. తనో గుమాస్తా అనేకదా సుందరి నాన్న అలా మాట్లాడాడు ?

"సుందరీ...మీ నాన్నకు కావలసింది డబ్బు. నాకో ఆర్నెల్లు టైం ఇవ్వు, నిన్ను నా దాన్ని చేసుకుంటాను. అప్పుడు మీ డాడీ తనే పెళ్ళి చేస్తాడు, ముందుకువచ్చి."

సుందరి నవ్వింది. "తమిళనాడు బంపర్ కొన్నావా ?"

"జోకు చెయ్యకు."

"నీ కోసం నిరీక్షిస్తూ ఉంటాను."

సుందరి చేతిని ముద్దు పెట్టుకుంటూ రాజు లేచాడు.

ఆర్నెల్లకి ఆరురోజుల ముందే రాజు అంబాసిడర్ దిగాడు. చూడగానే ఎవరయినా ఖరీదయిన మనిషని అనుకుంటారు. సుందరి అతణ్ని చూసి అవాక్కయిపోయింది.

"ఫ్యాన్సీ డ్రెస్ వేషం కాదుగా ?" కాఫీ యిస్తూ చమత్కారం విసిరింది.

"ఫాలోమీ...సుందరిని కారెక్కించుకుని రాజు బయలుదేరాడు. యాభై మైళ్ళ ప్రయాణం చేశాక గులాబీరంగు మేడముందు ఆగింది.

"ఇదే మనయిల్లు" రాజు గర్వంగా కారు దిగేడు."

కొత్త డిజైన్‌లో ఆ భవనం పూల తోట మధ్య ఓ పెద్ద పూవులా ఉంది. అడుగడుగునా రూపాయలు చేసే నగిషీలు కనిపిస్తున్నాయి. రాజు ఇల్లంతా చూపించాడు.

"వీటన్నిటికీ నువ్వు వారసురాలివి." సుందరి మాట్లాడకుండా కళ్ళతో చూస్తోంది. రాజు ఎలా ఎదిగిపోయాడు.

"రా...నా ఛాంబర్‌లో కూర్చుం

దాము." రాజు ప్రక్కగా నున్న కాటేజికి దారితీశాడు. యు ఫోం సోఫామీద కూర్చుని 555 సిగరెట్ వెలిగించాడు.

"నీముందు మేం బీదవాళ్ళం రాజూ! ఏ గాంబ్లింగ్ అయినా కొట్టావా? లేక ఎవర్నయినా మోసం చేశావా?" ఉండబట్టలేక అడిగింది సుందరి.

"అవేం కాదు. పెళ్ళయ్యాక చెబుతాను."

"రహస్యమా."

ఇంతలో భోజనానికి పిలుపు వచ్చింది. సుందరి, రాజు భోజనానికి కూర్చున్నారు. రాజు తన ఐశ్వర్యం గురించి చెబుతున్నాడు?

"అన్నట్లు నువ్వేం తినడంలేదేం ?"

"నిన్ను చూడగానే కడుపు నిండిపోయింది రాజూ."

భోజనాలయ్యాక పాను నములుతూ రాజు ప్రయివేటు గదిలో కూర్చున్నారు. "ముహూర్తం పెట్టమను మీ నాన్నని." రాజు ఆమె తొడమీద తల ఆన్చి పడుకున్నాడు.

"అయ్యగారూ, శాంతమ్మగారు పిలుస్తున్నారు." బయటనుంచి నౌకరు కేక వేశాడు.

"ఇప్పుడే వస్తానుండు." రాజు బయటికి నడిచాడు కంగారుగా.

సుందరి వెంటబడింది.

రాజు, శాంత సంభాషణల విన్నది. వెంటనే బయలుదేరి బస్సు ఎక్కింది. మర్నాడు రాజుకి టపాలో ఉత్తరం వచ్చింది.

"రాజూ ! నిన్ను పెళ్ళి చేసుకోవాలని నాకు ఏనాడూ లేదు. నిన్ను వదులుకోవడానికి ప్లాను వేశాను. నాకోసం నువ్వు మూర్ఛరోగం వున్న శాంతని పెళ్ళిచేసుకుని అంతస్థు పెంచుకున్నావు. నాకోసం ఆమెను అన్యాయం చెయ్యకు. ఇవాళ శాంతని మోసంచేసినట్లే రేపు నన్ను చెయ్యవని గ్యారంటీ ఏమిటి ? ఈ రహస్యం నాకు తెలిసిందని బాధ పడుతున్నావా ? పూర్ రాజూ !

సుందరి"

